బంగారం @ 83,000

రికార్డు స్థాయికి చేరుకున్న పదిగ్రాముల ధర

న్యూఢిల్లీ, జనవరి 24: బంగారం భగభగ మండుతున్నది. ఆకాశమే హద్దుగా దూసుకుపోతున్న పుత్తడి ధర మరో శిఖరానికి చేరుకున్నది. వరుసగా ఎనిమిది రోజులుగా పెరుగుతూ వచ్చిన గోల్డ్ ఏకంగా రూ.83 వేల మైలురాయిని అధిగమించింది. ఈ చారిత్రక గరిష్ఠ స్థాయికి చేరుకోవడం ఇదే తొలిసారి. అంతర్జాతీయంగా నెలకొన్న అనిశ్చిత పరిస్థితులతో దేశీయంగా డిమాండ్ ఊపందుకున్నదని ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ వెల్లడించింది. ఢిల్లీ బులియన్ మార్కెట్లో 99.9 శాతం స్వచ్ఛత కలిగిన పది్రగాముల బంగారం ధర రూ.200 ఎగబాకి రూ.83,100 పలికింది. అంతకు ముందు ఈ ధర రూ.82,900గా ఉన్నది. 99.5 శాతం స్వచ్ఛత కలిగిన పదిగ్రాముల ధర రూ.200 అధికమై రూ.82,700 పలికింది. ఇటు హైదరాబాద్‌లో 24 క్యారెట్ పదిగ్రాముల బంగారం ధర రూ.330 ఎగబాకి రూ.82,420కి చేరుకోగా, 22 క్యారెట్ ధర మరో రూ.300 అధికమై రూ.75,500గా నమోదైంది. అంతర్జాతీయంగా ధరలు పెరగడం వల్లనే దేశీయంగా రికార్డు స్థాయికి చేరుకున్నాయని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీ సీనియర్ అనలిస్ట్ సౌమిల్ గాంధీ తెలిపారు. అమెరికా అధ్యక్షుడిగా రెండోసారి బాధ్యతలు చేపట్టిన ట్రంప్ టారిఫ్‌ల విషయంలో దూకుడుగా ఉండటంతో అంతర్జాతీయంగా అనిశ్చిత పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో పెట్టుబడిదారులు తమ పెట్టుబడులను సురక్షితమైన బంగారం వైపు మళ్లించడంతో గత వారం రోజులుగా ధరలు పుంజుకుంటున్నాయన్నారు.

వెండి కూడా..

బంగారంతోపాటు వెండి కూడా పరుగులు పెట్టింది. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి కొనుగోళ్లు ఊపందుకోవడంతో కిలో వెండి ఏకంగా రూ.500 అధికమైంది. బులియన్ మార్కెట్లో వెండి రూ.94 వేలకు చేరుకున్నది. ఇటు హైదరాబాద్‌లో కూడా వెండి రూ.1,000 అధికమై రూ.1,05,000 పలికింది. ఇటు ఫ్యూచర్ మార్కెట్లో ఫిబ్రవరి నెల డెలివరీకిగాను పదిగ్రాముల పుత్తడి కాంట్రాక్ట్ ధర రూ.334 పెరిగి రూ.79,960గా ఉన్నది. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర 15.50 డాలర్లు అధికమై 2,780.50 డాలర్లకు చేరుకోగా, వెండి 1.53 శాతం పెరిగి 31.32 డాలర్లుగా నమోదైంది.

దక్షిణాదిలో ప్యూర్‌ఈవీ ప్లాంట్!

చెన్నై, జనవరి 24: ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన తయారీ సంస్థ ప్యూర్‌ఈవీ..దక్షిణాదిలో మరో ప్లాంట్‌ను ఏర్పాటు చేయడానికి సిద్ధమవుతున్నది. రూ.400 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేయతలపెట్టిన ప్లాంట్‌పై తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వాలతో సంప్రదింపులు జరుపుతున్నట్లు, త్వరలో కొలిక్కి వచ్చే అవకాశాలున్నాయని కంపెనీ ఫౌండర్, ఎండీ నిశాంత్ డొంగారి తెలిపారు. ఇప్పటికే హైదరాబాద్‌కు సమీపంలో సంగారెడ్డి వద్ద తయారీ ప్లాంట్ ఉన్నది. కొత్తగా ఏర్పాటు చేసే ప్లాంట్ సామర్థ్యం 2-5 లక్షల మధ్యలో ఉంటుందన్నారు.

ఒప్పో 'రెనో'సిరీస్

హైదరాబాద్, జనవరి 24: స్మార్ట్‌ఫోన్ల తయారీ సంస్థ ఒప్పో..సరికొత్తగా రెనో సిరీస్ ఫోన్లను విడుదల చేసింది. న్యూ మీడియాటెక్ 8350 చిప్‌సెట్, ఏఐ టెక్నాలజీతో తయారు చేసిన ఈ ఫోన్లు రూ.34 వేల ప్రారంభ ధరతో లభించనున్నాయి. రెనో 13 5జీ రకం మొబైల్ రెండు రకాల్లో లభించనుండగా, వీటిలో 8జీబీ+128 జీబీ మాడల్ రూ.34,199గాను, 8జీబీ+256 జీబీ రకం రూ.35,999గా నిర్ణయించింది. అలాగే రెనో 13 ప్రొ 5జీ రూ.44,999 నుంచి రూ.49,499 ధరలో లభించనున్నాయి.



పద్దులో పన్నెంత?

ఈసారి బడ్జెట్‌లో సామాన్యులకు సెక్షన్ 80 ప్రయోజనాలు పెరిగేనా!

న్యూఢిల్లీ, జనవరి 24: బడ్జెట్‌కు వేళైంది. వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2025-26)గాను కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఫిబ్రవరి 1న పార్లమెంట్‌లో కొత్త పద్దును ప్రవేశపెట్టనున్నారు. అయితే కొన్నేండ్లుగా వ్యక్తిగత ఆదాయ పన్ను (ఐటీ) చెల్లింపుదారులకు బడ్జెట్ ఊరించి ఉసూరుమనిపిస్తూనే ఉన్నది. దీంతో ఈసారి పద్దులోనైనా మోదీ సర్కారు ఊరటనిస్తుందా? ముఖ్యంగా పాత పన్ను విధానం కింద సెక్షన్ 80లోని వివిధ క్లాజ్‌ల ద్వారా వర్తించే పన్ను మినహాయింపు పరిమితుల్ని పెంచుతారా? అన్నది మిక్కిలి ప్రాధాన్యాన్ని సంతరించుకున్నది.

సెక్షన్ 80

దేశ ప్రజల పొదుపు, పెట్టుబడులను ప్రోత్సహించడానికి ఆదాయ పన్ను శాఖ.. సెక్షన్ 80లోని వివిధ క్లాజ్‌ల కింద పన్ను మినహాయింపుల్ని కల్పిస్తున్నది. వ్యక్తులు, హిందూ అవిభాజ్య కుటుంబాలు (హెచ్‌యూఎఫ్) వీటిని అధికంగా క్లెయిం చేసుకోవచ్చు. వార్షిక ఆదాయానికి సంబంధించి ఐటీ రిటర్నులు దాఖలు చేసేటప్పుడు ఆయా సెక్షన్ల కింద పన్ను మినహాయింపుల్ని తీసుకోవచ్చు. వాటిని పరిశీలిస్తే..

80సీ

ట్యాక్స్‌పేయర్లు రకరకాల పన్ను మినహాయింపులను సెక్షన్ 80సీ కింద కోరవచ్చు. వ్యక్తులు, హిందూ అవిభాజ్య కుటుంబాల (హెచ్‌యూఎఫ్)వారు అర్హులు. ఏటా రూ.1.5 లక్షల వరకు పన్ను మినహాయింపును అందుకోవచ్చు. ఈక్విటీ లింక్డ్ సేవింగ్స్ స్కీములు, పీపీఎఫ్/ఎస్‌పీఎఫ్/ఆర్‌పీఎఫ్, జీవిత బీమా ప్రీమియం చెల్లింపులు, గృహ రుణం అసలు, ఎస్ఎస్‌వై, ఎన్ఎస్‌సీ, ఎస్‌సీఎస్ఎస్ వంటి పథకాలకూ వర్తిస్తుంది. అలాగే 80సీసీసీ, 80సీసీడీ(1), 80సీసీఈ, 80సీసీడీ(1బీ), 80సీసీడీ(2) కింద కూడా క్లెయింలు చేసుకోవచ్చు.



ఈ సెక్షన్లపైనే గురి..

ప్రధానంగా సెక్షన్ 80సీ, డీ, ఈఈఏ, ఈఈబీ, జీజీ, టీటీబీల కింద ఐటీ మినహాయింపు పరిమితుల్ని పెంచాలన్న డిమాండ్లు వినిపిస్తున్నాయి. పెరిగిన ఖర్చులు, ద్రవ్యోల్బణం దృష్ట్యా ఈసారి బడ్జెట్‌లో ఊరటనివ్వాలని వేతన జీవులు, వ్యక్తిగత ట్యాక్స్‌పేయర్లు, సీనియర్ సిటిజన్లు కోరుతున్నారు. దీనివల్ల పొదుపు పథకాల్లో పెట్టుబడులు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, బీమా వంటివి అందరికీ ఆకర్షణీయంగా మారుతాయని నిపుణులు కూడా పేర్కొంటున్నారు. నిజానికి కరోనా దెబ్బకు కుప్పకూలిన దేశ ఆర్థిక వ్యవస్థ ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నది. కానీ రూపాయి విలువ పతనం, తయారీ రంగం డీలా, ద్రవ్యోల్బణం విజృంభణ, అధిక వడ్డీరేట్ల కారణంగా ఆయా రంగాల్లో నిస్తేజం ఆవరించింది. దీంతో వినిమయ శక్తి పెరిగేలా ఆదాయ పన్ను రేట్లలో, శ్లాబుల్లో మార్పులు చేయాల్సిన అవసరం ఉందని అంటున్నారు. అయితే పాత, కొత్త పన్ను విధానాలను తీసుకొచ్చిన మోదీ సర్కారు.. కొత్త పన్ను విధానానికే మెరుగులు దిద్దుతున్నది కానీ.. పాత పన్ను విధానాన్ని పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి. మరి ఈసారైనా ఈ విమర్శలు ఆగేలా నిర్ణయాలు ఉంటాయా? ఉండవా? అన్నది వేచిచూడాల్సిందే.

80డీ

వ్యక్తిగత, భాగస్వామి-పిల్లల కోసం తీసుకునే ఆరోగ్య బీమా కోసం ఏటా 25,000 వరకు సెక్షన్ 80డీ కింద పన్ను మినహాయింపును కోరవచ్చు. ఒకవేళ ట్యాక్స్‌పేయర్ వయసు 60 ఏండ్లు దాటితే ఇది రూ.50,000గా ఉన్నది. ఇక తల్లిదండ్రుల కోసం తీసుకునే ఆరోగ్య బీమాకూ మరో రూ.25,000 వరకు పన్ను మినహాయింపును అందుకోవచ్చు. తల్లిదండ్రుల వయసు 60 ఏండ్లు దాటితే ఈ ప్రయోజనం రూ.50,000. మొత్తంగా ఆరోగ్య బీమాలకు చేసే చెల్లింపుల్లో గరిష్ఠంగా ఏటా లక్ష రూపాయలదాకా పన్ను మినహాయింపులు తీసుకోవచ్చు. అలాగే 80డీడీ కింద ట్యాక్స్‌పేయర్స్ తమపై ఆధారపడిన దివ్యాంగుల వైద్య చికిత్సకు చేసే చెల్లింపులకుగాను ఏటా రూ.1.25 లక్షలదాకా పన్ను మినహాయింపును అందుకోవచ్చు. ట్యాక్స్‌పేయర్స్ వ్యక్తిగతంగా తీసుకునే వైద్య చికిత్స ఖర్చులకూ సెక్షన్ 80డీడీబీ కింద లక్ష రూపాయల వరకు క్లెయిం చేసుకోవచ్చు.

80ఈ

దేశ, విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించడానికి తీసుకున్న విద్యా రుణంపై చెల్లించే మొత్తం వడ్డీకి వ్యక్తిగత ఆదాయ పన్నులో సెక్షన్ 80ఈ కింద మినహాయింపు తీసుకోవచ్చు.

80ఈఈఏ

రుణంపై మొదటిసారి ఇల్లు కొన్నవారికి వర్తిస్తుంది. సెక్షన్ 80ఈఈఏ కింద గృహ రుణంపై చెల్లించే వార్షిక వడ్డీ మొత్తాల్లో రూ.1.5 లక్షల వరకు వ్యక్తిగత ఆదాయ పన్ను మినహాయింపును కోరవచ్చు. సెక్షన్ 24 కింద ప్రస్తుతమున్న రూ.2 లక్షల పన్ను మినహాయింపునకు ఇది అదనం. ఇక సెక్షన్ 80ఈఈ కూడా ఉన్నది. అందులో రూ.50,000 వరకే మినహాయింపును పొందేవారు. 2019 బడ్జెట్‌లో సెక్షన్ 80ఈఈఏను పరిచయం చేశారు.

80ఈఈబీ

విద్యుత్తు ఆధారిత వాహన (ఈవీ) కొనుగోలుదారులకు ఇది వర్తిస్తుంది. వాహన రుణంపై చెల్లించే వడ్డీలో సెక్షన్ 80ఈఈబీ కింద ఏటా రూ.1.5 లక్షల వరకు పన్ను మినహాయింపును అందుకోవచ్చు.

80జీ

సామాజిక బాధ్యతతో చేసే విరాళాలపై పన్ను మినహాయింపును సెక్షన్ 80జీ ద్వారా అందుకోవచ్చు. విరాళాలనుబట్టి పూర్తిగా లేదా సగం మేరకు పన్ను మినహాయింపును తీసుకోవచ్చు. ఇక సెక్షన్ 80జీజీబీ కింద రాజకీయ పార్టీలకు ఇచ్చే విరాళాలపై కంపెనీలు పన్ను మినహాయింపుల్ని క్లెయిం చేసుకోవచ్చు. అలాగే సెక్షన్ 80జీజీసీ కింద రాజకీయ పార్టీలకు ఇచ్చిన విరాళాలపై వ్యక్తులు క్లెయిం చేసుకోవచ్చు.

80జీజీ

అద్దె ఇంట్లో నివసిస్తున్నా తమ జీతాల్లో హౌజ్ రెంట్ అలవెన్స్ (హెచ్‌ఆర్‌ఏ)ను పొందలేకపోతున్న ఉద్యోగులు.. సెక్షన్ 80జీజీ కింద పన్ను మినహాయింపును క్లెయిం చేసుకోవచ్చు. నెలకు రూ.5,000 చొప్పున ఏడాదికిగాను తమ వార్షిక ఆదాయంలో గరిష్ఠంగా రూ.60,000 వరకు పన్ను మినహాయింపును ఫారం 10 బీఏ ద్వారా కోరవచ్చు.

80ఆర్ఆర్‌బీ

పేటెంట్ హక్కుల కింద రాయల్టీని పొందినప్పుడు సెక్షన్ 80ఆర్ఆర్‌బీ ద్వారా రూ.3 లక్షల దాకా పన్ను మినహాయింపుల్ని కోరవచ్చు. కాపీరైట్ లేదా రాయల్టీ ద్వారా పొందే ఆదాయంపై రచయితలు సెక్షన్ 80క్యూక్యూబీ కింద పన్ను మినహాయింపుల్ని కోరవచ్చు.

80టీటీఏ

పొదుపు ఖాతాలపై వడ్డీ విషయంలో వ్యక్తులు, హిందూ అవిభాజ్య కుటుంబాలు సెక్షన్ 80టీటీఏ కింద ఏటా గరిష్ఠంగా రూ.10,000 వరకు పన్ను మినహాయింపును కోరవచ్చు.

80టీటీబీ

60 ఏండ్లు, ఆపై వయసుగల సీనియర్ సిటిజన్లు తమ డిపాజిట్ల నుంచి పొందే వడ్డీ ఆదాయంపై సెక్షన్ 80టీటీబీ కింద ఏటా గరిష్ఠంగా రూ.50,000 వరకు పన్ను మినహాయింపును పొందవచ్చు.

80యూ

భౌతిక, మానసిక సమస్యలతో బాధపడే వ్యక్తులకు సెక్షన్ 80యూ కింద తీవ్రతనుబట్టి రూ.75,000-1,25,000 వరకు పన్ను మినహాయింపును కేంద్ర ప్రభుత్వం కల్పిస్తోంది. అయితే వైద్యుల ధృవీకరణ తప్పనిసరి.

సూచీల వరుస ర్యాలీకి బ్రేక్

ముంబై, జనవరి 24: దేశీయ స్టాక్ మార్కెట్ల వరుస ర్యాలీకి బ్రేక్‌పడింది. లాభాల్లో ప్రారంభమైన సూచీలకు చివరికి నష్టాల్లోకి జారుకున్నాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన ప్రతికూల సంకేతాలకు తోడు రియల్టీ, ఆయిల్‌అండ్ గ్యాస్, హెల్త్‌కేర్ రంగ షేర్లు అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొనడంతో సూచీలు చివరకు నష్టాలను ఎదుర్కొన్నాయి. వారాంతపు ట్రేడింగ్‌లో ఒక దశలో 400 పాయింట్లకు పైగా నష్టపోయిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు 329.92 పాయింట్లు నష్టపోయి 76,190.46 వద్ద ముగిసింది. మరో సూచీ నిఫ్టీ 113.15 పాయింట్లు కోల్పోయి 23,092.20 వద్ద పరిమితమైంది. మొత్తంమీద ఈవారంలో సెన్సెక్స్ 428.87 పాయింట్లు, నిఫ్టీ 111 పాయింట్లు కోల్పోయాయి. 30 షేర్ల ఇండెక్స్‌లో మహీంద్రా అండ్ మహీంద్రా, జొమాటో, టాటా మోటర్స్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, రిలయన్స్, ఎల్‌అండ్‌టీ, ఉల్ట్రాటెక్ సిమెంట్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, అదానీ పోర్ట్స్, బజాజ్ ఫిన్‌సర్వ్‌లు నష్టపోయాయి. కానీ, హెచ్‌యూఎల్, టెక్ మహీంద్రా, నెస్లె, భారతీ ఎయిర్‌టెల్, ఐసీఐసీఐ బ్యాంక్‌లు లాభాల్లో ముగిశాయి.

ఇండిగో ప్రాఫిట్ డౌన్

న్యూఢిల్లీ, జనవరి 24: దేశంలో అతిపెద్ద విమానయాన సంస్థ ఇండిగో నిరాశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. డిసెంబర్‌తో ముగిసిన మూడు నెలల కాలానికిగాను సంస్థ రూ.2,450 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది. అంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో ఆర్జించిన రూ.2,986 కోట్ల లాభంతో పోలిస్తే 18 శాతం తగ్గింది. కంపెనీ ఆదాయం రూ.20,062 కోట్ల నుంచి రూ.22,992 కోట్లకు ఎగబాకినట్లు వెల్లడించింది.

గ్రాన్యూల్స్ లాభం 118 కోట్లు

హైదరాబాద్, జనవరి 24: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికిగాను రూ.118 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని ఆర్జించింది గ్రాన్యూల్స్ ఇండియా. 2023-24 ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.126 కోట్ల లాభంతో పోలిస్తే 6 శాతం తగ్గినట్లు బీఎస్‌ఈకి సమాచారం అందించింది. ఏడాది క్రితం రూ.1,156 కోట్లుగా ఉన్న సంస్థ ఆదాయం ఈసారి త్రైమాసికంలో రూ.1,138 కోట్లకు తగ్గినట్లు పేర్కొంది. ఈ సందర్భంగా కంపెనీ సీఎండీ కృష్ణప్రసాద్ మాట్లాడుతూ..ఉత్తర అమెరికా నిరాశాజనక పనితీరు కనబరిచినప్పటికీ లాభాలను నమోదు చేసుకున్నట్లు చెప్పారు. గతేడాది సెప్టెంబర్‌లో అమెరికా నియంత్రణ మండలి హైదరాబాద్‌లో ఉన్న ప్లాంట్‌లో తనిఖీలు చేసి పలు అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో ఉత్పత్తిని నిలిపివేసినట్లు, మళ్లీ అక్టోబర్‌లో తిరిగి ప్రారంభించడం కూడా ఆర్థిక ఫలితాలపై ప్రతికూల ప్రభావం చూపిందన్నారు.

నాణ్యమైన పత్తిని తీసుకురావాలి

బేల, జనవరి 24 : ఆదిలాబాద్ జిల్లా బేలలోని అషపుర జిన్నింగ్ మిల్లులో కొనుగోళ్లు చేస్తున్న సీసీఐకి రైతులు నాణ్యమైన పత్తిని మాత్రమే తీసుకురావాలని బేల సీసీఐ సెంటర్ ఇన్‌చార్జి తెలిపినట్లు బేల మార్కెట్ అధికారి శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటన తెలిపారు. రైతులు నాణ్యమైన పత్తిని నమిత ప్రమాణాలకు అనుగుణంగా తీసుకురన్నట్లయితే సీసీఐ ఆధ్వర్యంలో ఎట్టి పరిస్థితిలో ప్రతి కొనుగోలు చేయడం జరగదని తెలిపారు. కావున రైతులందరూ నాణ్యమైన పత్తిని తీసుకువచ్చి పూర్తి ఎంఎస్పీ మద్దతు ధర 7421 పొందాలని రైతులకు సూచించారు.

ఎగుమతి, దిగుమతి రేట్లను పెంచాలి

ఎదులాపురం, జనవరి 24 : ఆదిలాబాద్‌లోని సెంట్రల్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ గోదాం ఎదుట శుక్రవారం ముకాడ్‌దమ్‌లు షేక్ దస్తగిరి, అన్నపూర్ణే సంబాజీ, అబ్దుల్ ఖాలం, అక్రేవాడ్ గోపాల్, వసంత్‌హన్ ఆధ్వర్యంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్ ఏఐటీయూసీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిర్ర దేవేందర్ మాట్లాడుతూ సీడబ్ల్యూసీ గోదాంలో పని చేస్తున్న హమాలీ కార్మికులకు ప్రస్తుత కాలంలో పెరుగుతున్నటువంటి నిత్యావసర వస్తువులకు అనుగుణంగా కాంట్రాక్టర్ ఎగుమతి దిగుమతి రేట్లును పెంచాలన్నారు. కార్యక్రమంలో సిందే అమృత్, ఎస్ గంగాధర్, కపిల్, లతీఫ్‌ఖాన్, అనిల్ సింధే, ముకింద్, అనిల్ పాల్గొన్నారు.

కల్లుగీత సహకార సంఘం కార్యవర్గం

ఎదులాపురం, జనవరి 24: కల్లుగీత సహకార సంఘం ఆదిలాబాద్ జిల్లా ఎన్నికలు శుక్రవారం నిర్వహించారు. సహకార శాఖ రాష్ట్ర ఎన్నికల అథారిటీ, హైదరాబాద్ ఆదేశాల మేరకు సహకార శాఖ జూనియర్ ఇన్‌స్పెక్టర్ శ్వేత ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. కల్లుగీత సహకార సంఘం, జిల్లా అధ్యక్షుడిగా పీ నర్సాగౌడ్, కార్యదర్శిగా సురేశ్ గౌడ్, వైస్ ప్రెసిడెంట్‌గా ఆర్ సంజీవ్ గౌడ్, మేనేజింగ్ కమిటీ సభ్యులుగా సీ నర్సమ్మ, ఎస్ భగీరథ బాయిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గం 2030 వరకు కొనసాగుతుందని సహకార శాఖ జూనియర్ ఇన్‌స్పెక్టర్ శ్వేత తెలిపారు. కల్లుగీత సహకార సంఘం, ఆదిలాబాద్ అధ్యక్షుడు నర్సాగౌడ్ మాట్లాడుతూ సంఘంలో ఉన్న సభ్యుల సమస్యలు పరిష్కరిస్తానని, సంఘం బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులను శాలువాతో సన్మానించారు.

పోలీస్ స్టేషన్‌లో పార్కు ప్రారంభం

నూతన పార్కును ప్రారంభిస్తున్న చిన్నారులు, ఎస్పీ గౌష్ అలం, ఉట్నూర్ ఏఎస్పీ కాజల్

ఇంద్రవెల్లి, జనవరి 24: ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లిలోని పోలీస్ స్టేషన్‌లో పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నూతన పార్కును ఎస్పీ గౌష్ అలం, ఉట్నూర్ ఏఎస్పీ కాజల్‌తో పాటు చిన్నారులతో కలిసి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పార్కు పిల్లలకు ఎంతోగాను ఉపయోగకరంగా ఉంటుందన్నారు. పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహించే పోలీస్ సిబ్బంది పిల్లలు బయటకు వెళ్లకుండా పార్కులోనే ఎంతో హాయిగా ఆడుకోవడం జరుగుతుందన్నారు. దీంతో పిల్లల్లో ఎదుగుదలు ఉంటుందన్నారు. ఏర్పాటు చేసిన పార్కును పిల్లలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉట్నూర్ మాజీ డీఎస్పీ నాగేందర్‌గౌడ్, ఉట్నూర్ సీఐ మొగలి, ఎస్ఐ సునీల్ పాల్గొన్నారు.

ఆడపిల్లను పుట్టనిద్దాం.. భద్రతనిద్దాం..

ఎదులాపురం : మాట్లాడుతున్న డీసీపీవో రాజేంద్రప్రసాద్

ఎదులాపురం, జనవరి 24 : ఆడపిల్లలను పుట్టనిద్దాం.. వారికి భద్రతనిద్దాం...స్వేచ్ఛ జీవితాన్ని అందిద్దామని జిల్లా బాలల సంరక్షణ అధికారి రాజేంద్రప్రసాద్ అన్నారు. జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఆదిలాబాద్‌లోని మహాలక్ష్మీవాడ ప్రభుత్వ పాఠశాలలో షుర్ ఎన్జీవో ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీసీపీవో రాజేంద్రప్రసాద్, సీడబ్ల్యూసీ చైర్మన్ వెంకటస్వామి హాజరయ్యారు. ఈ సందర్భంగా డీసీపీవో రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ఆడపిల్లల రక్షణ, సంరక్షణ కోసం ఒక వ్యవస్థనే పని చేస్తుందన్నారు. వారికి కోసం ప్రత్యేకంగా జేజేబీ కోర్టు, చైల్డ్‌లైన్, ఐసీపీఎస్,ఎన్జీవోలు పని చేస్తున్నాయని తెలిపారు. ఆపదలో ఉన్నవారు ఎవరికి భయపడకుండా డయల్ 100, 181, 1098 నంబర్లకు కాల్ చేయాలన్నారు. సీడబ్ల్యూసీ చైర్మన్ వెంకటస్వామి మాట్లాడుతూ బాలికల హక్కుల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని తెలిపారు. అలాగే ఎంత కష్టము వచ్చిన చదువు మధ్యలో అపివేయవద్దని సూచించారు. షుర్ ఎన్జీవోకు సంబంధించిన కరపత్రాలను సభ్యులు విడుదల చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం పిల్లి కిషన్, చైల్డ్‌లైన్ కోఆర్డినేటర్ సతీశ్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు నరేందర్, డీసీపీయూ పద్మ, ప్రేమ్‌కుమార్, అశ్విని, షుర్ ఎన్జీవో జిల్లా కోఆర్డినేటర్ వినోద్, ఫీల్డ్ సూపర్‌వైజర్ సుమలత పాల్గొన్నారు.

ఎదులాపురం, జనవరి 24 : లింగ వివక్షత లేకుండా బాలబాలికలకు రాజ్యాంగం సమాన హక్కులను కల్పించిందని డీఎల్ఎస్ఏ కార్యదర్శి సౌజన్య అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్‌లోని లిటిల్ స్టార్ స్కూల్‌లో జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా డీఎల్ఎస్ఏ కార్యదర్శి సౌజన్య మాట్లాడుతూ చిన్నారుల కోసం డీఎల్ఎస్ఏ తరపున ప్రత్యేక యూనిట్ ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ జీవన్ రెడ్డి, పీపీలు రమణ రెడ్డి, మధుకర్, వన్ టౌన్ సీఐ సునీల్ కుమార్, పాఠశాల ప్రిన్సిపాల్ కమలాకర్ రెడ్డి పాల్గొన్నారు.

బోథ్(తలమడుగు), జనవరి 24 : ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలంలోని భరంపూర్ జిల్లా పరిషత్ ఉన్నత సెకండరీ పాఠశాలలో జిల్లా మహిళా సాధికారత కేంద్రం - మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. గ్రామంలో ర్యాలీ తీసి బేటీ బచావో, బేటీ పడావో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం పాఠశాలలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం ప్రత్యూష దేశంలో ఆడపిల్లలు ఎదుర్కొంటున్న విద్య, పోషకాహారం, చట్టపరమైన హక్కులు, రక్షణ, గౌరవం వంటి సమస్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా మహిళా సాధికారత కేంద్రం జిల్లా మిషన్ కోఆర్డినేటర్ యశోద, నిఖలేశ్వర్, డీహెచ్ఈడబ్ల్యూ సిబ్బంది కోటేశ్వర, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేరడిగొండ, జనవరి 24 : ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండలంలోని కుమారి గ్రామంలోని ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రంలో జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు. పీఏసీఎస్ చైర్మన్ మందుల రమేశ్ బాలికలకు శాలువాతో సన్మానించారు. అనంతరం వారికి స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో గ్రామ యువకులు బూతి అడెల్లు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్, పిల్లలు పాల్గొన్నారు.

మర్రిచెట్ల వద్దకు చేరిన మెస్రం వంశీయులు



చెట్టుపై భద్రపర్చిన గంగాజలం ఝురికి మొక్కుతున్న మెస్రం వంశీయులు

ఇంద్రవెల్లి, జనవరి 24: మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలోని కలమడుగు వద్ద గోదావరి నదిలోని హస్తలమడుగులో జనవరి 17న ప్రత్యేక పూజలు నిర్వహించి ఝురిలో సేకరించిన పవిత్ర గంగాజలంతో మెస్రం వంశీయులు శుక్రవారం రాత్రి కేస్లాపూర్ మర్రిచెట్లవద్దకు చేరుకున్నారు. అక్కడ ప్రత్యేక సంప్రదాయ పూజలు నిర్వహించి గుడారాలు ఏర్పాటు చేశారు. గంగాజలం ఝురితో మెస్రం వంశీయులు మర్రిచెట్లకు చేరుకున్నట్లు నాగోబా పేన్ కొత్వాల్ తిరుపతి మెస్రం వంశీయుల పటేళ్లకు సమాచారం అందించారు. హస్తలమడుగు నుంచి తీసుకొచ్చిన పవిత్ర గంగాజలం ఝురిని మర్రిచెట్ల ప్రాంతంలోని ఓ చెట్టుపై తెల్లని వస్త్రంతో కట్టి భద్రపరిచారు. కార్యక్రమంలో మెస్రం కోసుకటోడ, కటోడ దేవ్‌రావ్, పర్ధాంజీ మెస్రం దాదారావ్, కోసేరావ్ కటోడ, నాగోబా పేన్ కోత్వాల్ తిరుపతి, నాయక్‌వాడీ మెస్రం ధర్ము, కటోడ హనుమంత్‌రావ్, మెస్రం వంశీయులు పాల్గొన్నారు.

క్రీడలు మానసికోల్లాసానికి దోహదం

భైంసా, జనవరి 24 : క్రీడలు మానసికోల్లాసానికి దోహదపడుతాయని భైంసా న్యాయమూర్తి దేవేంద్ర బాబు అన్నారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం నిర్మల్ జిల్లా భైంసా కోర్టులో క్రీడాపోటీలు నిర్వహించారు. క్యారమ్ పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సీ శంకర్, న్యాయవాదులు సంతోష్, సాయినాథ్, కుంట కీర్తి, మాధవి పాల్గొన్నారు.

నాగోబా జాతరను విజయవంతం చేయాలి



మర్రిచెట్ల ప్రాంతంలో అధికారులతో కలిసి ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ రాజర్షి షా

ఇంద్రవెల్లి, జనవరి 24: నాగోబా జాతరను విజయవంతం చేయాలని ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలోని కేస్లాపూర్ నాగోబా దర్బార్‌హాల్‌లో ఐటీడీఏ పరిధిలోని అధికారులతో పాటు ఆయా శాఖలకు చెందిన జిల్లా స్థాయి అధికారులతో జాతర ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు. ముందుగా శాఖల వారీగా చేసిన ఏర్పాట్ల పనులతో పాటు అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించి చేపట్టే పనుల వివరాలను శాఖల వారీగా అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షి షా, ఐటీడీఏ పీవో ఖుష్బుగుప్తా మాట్లాడుతూ ఈ నెల 28న రాత్రి మెస్రం వంశీయుల మహాపూజలతో ప్రారంభమై నాగోబా జాతర ఉత్సవాలు అధికారికంగా ఫిబ్రవరి 4వ తేదీ వరకు కొనసాగుతాయని తెలిపారు. నాగోబా దర్బార్‌కు రాష్ట్ర మంత్రులు వచ్చే అవకాశాలు ఉన్నందున వారికి అనుగుణంగా అన్ని ఏర్పాట్లు అందుబాటులో ఉండాలన్నారు. భక్తులకు ఎలాంటి సమస్యలు కలగకుండా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ప్రభుత్వ స్టాల్స్ ఏర్పాటు స్థలంతోపాటు మర్రిచెట్ల ప్రాంతం, గోవాడ్, దర్బార్‌హాల్ ప్రాంతం, నాగోబా ఆలయ పరిసరాలను పరిశీలించి ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. నాగోబా ఆలయంలో కలెక్టర్ రాజర్షి షా, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్, ఐటీడీఏ పీవో ఖుష్బుగుప్తా, ఎస్పీ గౌష్ అలం, ఉట్నూర్ ఏఎస్పీ కాజల్, ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్, శిక్షణ కలెక్టర్ అభిజ్ఞాన్ మాలవీయ ప్రత్యేక పూజలు చేశ్నారు. కార్యక్రమంలో పీవీటీజీ ప్రత్యేక అధికారి మెస్రం నోహర్, మెస్రం వంశీయుల పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్‌పటేల్ పాల్గొన్నారు.

ప్రైవేట్ డిగ్రీ కళాశాల అధ్యాపకుల భిక్షాటన

బేల, జనవరి 24: రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేసి ప్రైవేట్ పాఠశాలలను ఆదుకోవాలని ప్రైవేట్ డిగ్రీ కళాశాల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ సభ్యులు డిమాండ్ చేశారు. ప్రభుత్వ వైఖరిని ఖండిస్తూ శుక్రవారం బేలలోని పలు దుకాణాల్లో అధ్యాపకులు, విద్యార్థులు భిక్షాటన చేశారు. ఈ సందర్భంగా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పుష్ప మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్నటువంటి ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని అన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు సాగర్ సౌందర్య, బిందు, అమోల్ పాల్గొన్నారు.

సారంగాపూర్, జనవరి 24: నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలంలోని పద్మావతి డిగ్రీకళాశాల అధ్యాపకులు శుక్రవారం భిక్షాటన చేశారు. విద్యార్థులకు ఉపకార వేతనాలు, కళాశాలకు ఫీజు బకాయిలు విడుదల చేయాలని దుకాణాల్లో భిక్షాటన చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ హైమద్ అధ్యాపకులు పాల్గొన్నారు.

రైతు భరోసాలో అక్రమాలంటూ మహిళల ఆగ్రహం

కౌఠ(బీ) గ్రామ సభలో ఆందోళనకు దిగిన ప్రజలు

బోథ్, జనవరి 24 : బోథ్ మండలంలోని సొనాల గ్రామంలో ఇందిరమ్మ ఆత్మీయ రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లలో లబ్ధిదారుల గుర్తింపులో జరిగిన అక్రమాలపై మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల మధ్య వాగ్వాదం జరిగింది. కౌఠ(బీ)లో ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో అవకతవకలు జరిగాయని అధికారులను నిలదీస్తూ ఆందోళన చేపట్టారు. సీఐ వెంకటేశ్వర్‌రావ్, ఎస్ఐ ప్రవీణ్‌కుమార్, శిక్షణ ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి వచ్చి గ్రామస్తులను సముదాయించారు. చింతలబోరిలో ఫ్లెక్సీలో ఎమ్మెల్యే ఫొటో ఎందుకు లేదని అధికారులపై నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ గంట పాటు ఆందోళన చేశారు. గ్రామ సభల్లో మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్, ఏఎంసీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

డ్రైవర్ల పాత్ర ఎంతో కీలకం



రోడ్డు భద్రతపై ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు

ఎదులాపురం, జనవరి 24 : ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడంలో డ్రైవర్ల పాత్ర ఎంతో కీలకమని ఎంవీఐ అశ్వంత్ కుమార్ అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్‌లోని ఆర్టీసీ బస్టాండ్‌లో రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా డ్రైవర్ డేను ఘనంగా నిర్వహించారు. ప్రమాద రహితంగా బస్సు నడిపిన డ్రైవర్లను సన్మానించారు. అనంతరం వ్యాసరచన పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా బస్టాండ్ నుంచి ర్యాలీ తీస్తూ డ్రైవర్లకు గులాబీ పువ్వు ఇస్తూ ప్రమాద రహితంగా వాహనాలు నడపాలని విద్యార్థులతో కలిసి అధికారులు కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆర్ఎం ప్రణీత్, ఏఎంవీఐ విజయ్ కుమార్, డీఎం కల్పన, టూ టౌన్‌సీఐ కరుణాకర్ రావు, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.